క్లుప్తంగా

ఎన్నికల కోడ్ ఉల్లంఘన



నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేరుతో దర్శనమిస్తున్న శిలాఫలకం

పీలేరు రూరల్ : ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పేరుతో ఉన్న ఓ శిలాఫలకం దర్శనమిస్తోంది. మండలంలోని యర్రగుంటపల్లె పంచాయతీ నెట్టిబండ సమీపంలో ఏపీ ప్రభుత్వం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కృషి వికాస్ యోజన గొర్రెల సంత అభివృద్ధి పథకంలో 2011 జనవరి 30న ఏర్పాటు చేసిన శిలాఫలకం ఎలాంటి ముసుగు కానీ, కవర్ గానీ చేయకుండా దర్శనమిస్తోంది. ఇది ఎన్నికల కోడ్ ఉల్లంఘన కాదా అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు

కలికిరి: ప్రశాంత వాతావరణంలో ఎన్నికల నిర్వహణకు, ఎన్నికలలో ఎటువంటి ఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు చర్యలుగా సాయుధ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు సీఐ ఆర్.మోహన్ తెలిపారు. మండలంలోని మహల్, గుండ్లూరు. పత్తేగడ గ్రామం కొటాలలో ఆదివారం పోలీసులు సాయుధ బలగాలతో కలిసి ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ప్రజలు, రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని సీఐ కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మదనపల్లె : కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకుని ఓ వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు తాలూకా సీఐ ఎన్.శేఖర్ తెలిపారు. వైఎస్సార్ కడప, సీఎంఆర్‌పల్లెకు చెందిన భాస్కర్ కుమారుడు టి.మణికంఠ(25) కర్ణాటక నుంచి బ్లాక్‌డాగ్ విస్కీ మూడు ఫుల్ బాటిల్స్ ఆర్టీసీ బస్సులో అక్రమంగా తరలిస్తుండగా మండలపరిధిలోని రాష్ట్ర సరిహద్దు చీకలబైలు చెక్‌పోస్ట్ వద్ద తనిఖీల్లో భాగంగా స్వాధీనం చేసుకున్నామన్నారు. మద్యం విలువ రూ.2,100 ఉంటుందని తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

12 లీటర్ల సారా పట్టివేత

నిమ్మనపల్లె : సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ సి.లోకేష్ రెడ్డి తెలిపారు. ఆదివారం కొండయ్యగారిపల్లె పంచాయతీకి చెందిన పల్లపురవి కొండయ్యగారిపల్లెకు సమీపంలో సారా విక్రయిస్తున్నాడన్న సమాచారం అందడంతో సిబ్బందితో కలిసి దాడిచేశామన్నారు. అతనివద్ద నుంచి 12లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. ఈ దాడిలో పోలీస్‌సిబ్బంది రాజేష్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

పొట్టేళ్లకు భలే గిరాకీ



సంతలో పొట్టేళ్లు

పీలేరు రూరల్ : రంజాన్‌మాసంను పురష్కరించుకుని పొట్టేళ్లకు భలే గిరాకీ ఏర్పడింది. ఆదివారం పీలేరు పట్టణంలోని మార్కెట్ యార్డులో గొర్రెల సంత వినియోగదారులతో కిటకిటలాడింది. ఈ సంతకు పక్క రాష్ట్రాల నుంచి వ్యాపారులు అధిక సంఖ్యలో రావడంతో గిరాకీ ఏర్పడింది. ఈ వారంలో రంజాన్, ఉగాది పండుగలు ఉండడంలో పొట్టేళ్లు, మేకపోతులు కొనడానికి పెద్ద ఎత్తున ఎగబడ్డారు. దీంతో ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. రూ. 10 వేల నుంచి రూ. 50 వేల వరకు ధర పలికాయి.

మంచి జీవనశైలితో ఆరోగ్యం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖాధికారులు

పీలేరు : మంచి జీవనశైలితో ఆరోగ్యం సిద్ధిస్తుందని పీలేరు ప్రభుత్వాస్పత్రి వైద్యాధికారి డాక్టర్ శివయ్య అన్నారు. ఆదివారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా ఆరోగ్యం – నా హక్కు ప్రత్యేక నినాదం సిద్ధించాలంటే మంచి జీవనశైలితో జీవన నాణ్యతను పెంచుకోవాలని సూచించారు. తగినంత నిద్ర, నీరు, వ్యాయామం తోపాటు ఒత్తిడి లేని జీవనం, మితాహారం, మెరుగైన మానవ సంబంధాలు కలిగి ఉన్నారు. తగు సమయానికి ఆరోగ్య పరీక్షలు చేపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు, సీహెచ్‌వోలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో షబ్-ఏ-ఖదర్



ధార్మికోపన్యాసం చేస్తున్న మత గురువులు

మదనపల్లె సిటీ: పవిత్ర రంజాన్ మాసంలోని 27వ రాత్రిని పురస్కరించుకుని షబ్-ఏ-ఖదర్‌ను శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మదనపల్లె పట్టణంలోని జామియా మసీదులతో పాటు పలు మసీదులు, ఖబ్రస్థాన్‌లను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఇందులో భాగంగా 28 రోజులుగా పఠిస్తూ వచ్చిన దివ్య ఖురాన్‌ను అన్ని మసీదుల్లోనూ పూర్తి చేశారు. స్థానిక సల్మాన్‌పార్సీ మసీదులో ప్రభుత్వ సర్‌ఖాజీ హాఫీజ్ ఇక్బాల్‌అహ్మద్ ధార్మికోపన్యాసం చేశారు. ఇస్లాంలో రంజాన్ మాసానికి మరీ ముఖ్యంగా షబ్-ఏ-ఖదర్‌కు ఉన్నత ప్రాముఖ్యతను వివరించారు. సోదరభావంతో ఐక్యంగా ఉండాలని సూచించారు. ఈ మాసంలో ప్రతి ముస్లిం విధిగా దానధర్మాలు చేయాలని తెలిపారు. ఇస్లాంలో ప్రార్థనలకు ఎంత ప్రాముఖ్యత ఉందో ధాన,ధర్మాలకు కూడా అంతే ప్రాధాన్యం ఉందన్నారు. ఫిత్రా, జకాత్ రూపంలో ధానధర్మాలు చేసి పేదలు కూడా పండుగ సంతోషంగా జరుపుకునేలా చూడాలని సూచించారు. అనంతరం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తర్వాత ఖబ్రస్థాన్‌కు వెళ్లి పూర్వీకుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

మతతత్వ పార్టీలను తరిమికొట్టాలి



ముస్లిం మైనారిటీ నాయకులతో సాహిత్‌రెడ్డి

కేవీపల్లె : మతతత్వ పార్టీలను ఈ సార్వత్రిక ఎన్నికల్లో తరిమికొట్టాలని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి. సాహిత్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని జిల్లేళ్లమంద పంచాయతీ దేవాండ్లపల్లెలో ముస్లిం మైనారిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ముస్లిం మైనారిటీల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. మసీదుల అభివృద్ధికి, షాదీమహల్‌ల అభివృద్ధిని విరివిగా నిధులు కేటాయించినట్లు చెప్పారు. ముస్లింలకు వ్యతిరేకంగా పనిచేస్తున్న బీజేపీ, టీడీపీ, జనసేన కూటమికి ముస్లింలు తమ ఓట్ల ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అస్లాం, జబీర్, రెడ్డిఖాన్, రషీద్, మొమమ్మద్, ముబారక్, కరీమ్, హాసిమ్, రెడ్డిబాషా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే చింతల

కలకడ : మండలంలోని కోన గ్రామానికి చెందిన చెంచు సురేంద్రరెడ్డి తన అనుచరులతో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరారు. ఆదివారం కోన గ్రామంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన అభివృద్ధి, గడపగడపకు అందిస్తున్న సంక్షేమ పథకాల లబ్ధి చూసి ఆకర్షితులై పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల ఆర్‌బీకే చైర్మన్ హరినాథరెడ్డి, ప్రత్యేక ఆహ్వానితురాలు సరళ, నాయకులు మధుసూదన్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, గోవర్ధన్, కత్తిరమణ, బాషఖాన్, చోటు, తదితరులు పాల్గొన్నారు.

పెత్తందారులపై విజయమే ధ్యేయం

కలకడ : పెత్తం దారులపై పేదల విజయమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ ధ్యేయం అని ఎంపీ పివి మిథున్‌రెడ్డి, పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం కలకడలో మండల స్థాయి వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. 99శాతం మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి కుటుంబంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరే హక్కును, అవకాశాన్ని మనకు కల్పించారని గుర్తు చేశారు. స్థానిక పదవుల్లో 50 శాతం మహిళలకు కేటాయించడం, స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అధికంగా దళిత సమాజానికి రూ.6 2వేల కోట్లు ఖర్చున చేసిన వ్యక్తి కూడా జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని గుర్తు చేశారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్ళు మూసివేశారని జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత నాడు-నేడు కింద ఎంతో అ భివృద్ధి చేసి ఇంగ్లీష మీడియం విద్యను అందిస్తున్నారన్నారు. ఒంటరిగా ఎన్నికల బరిలో దిగలేక జనసేన, మతతత్వ బీజేపీ చివరికి కాంగ్రెస్‌తో కూడా పొత్తుకు చంద్రబాబుకు ప్రయత్నిస్తున్నాడని అనుమానం ఉందన్నారు. వైఎస్సార్ సీపీని గెలిపించడానికి సంక్షేమ పథకాలు పొందిన లబ్ధిదారులు సిద్ధంగా ఉన్నారని, బాబు మాయ మాటలు వినే స్థితిలో ఓటర్లు లేరన్నారు. కార్యకర్తలు, అభిమానులు ఓటర్లుకు మన రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవశ్యకతను, అవసరాన్ని, ఇచ్చిన మాటకు కట్టుబడి, నిజాయితీగా అందించే పథకాలను వివరించి ఓట్లు అభ్యర్థించాలని కోరారు. ఎంపీగా పివిమిథున్‌రెడ్డి, ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డి హ్యాట్రిక్ విజయానికి సిద్ధంగా ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ మాజీ కమిటీ చైర్మన్‌లు తిమ్మారెడ్డి, రవికుమార్‌రెడ్డి, జిల్లా జెసీఎస్ పరిశీలకులు నరసింహారెడ్డి, పార్టీ పరిశీలకులు సహదేవరెడ్డి, ఎంపీపీ శ్రీదేవి, జడ్పీటీసీ సభ్యురాలు హారిక, సర్పంచ్ శాంతమ్మ, కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, సింగల్‌విండో అధ్యక్షులు వెంకట్రమణరెడ్డి, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు కలికిరిలో గడప గడపకు ప్రచారం

కలికిరి: మండల కేంద్రంలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సోమవారం గడప గడపకు ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటలకు టీ.బీ.రోడ్డు, 9 గంటలకు ఏఎన్ఆర్ కాలని, సాయంత్రం 4 గంటలకు రామ్‌నగర్ కాలని ప్రాంతాల్లో ఎమ్మెల్యే ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని, మండలంలోని వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మహిళలు, యువత హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

భక్తిశ్రద్ధలతో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం



కోయిల్ ఆళ్వార్ సేవలో అర్చకులు, భక్తులు

వాల్మీకిపురం: వాల్మీకిపురం పట్టాభిరామాలయంలో ఆదివారం టీటీడీ ఆధ్వర్యంలో కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలకు ముందు జరిగే ఈ కార్యక్రమంలో ముఖ్యంగా ఆలయ గర్భగుడి మొదలు పరిసరాలు, రాముడి బ్రహ్మ రథానికి సుగంధ ద్రవ్యాలతో శుద్ధి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో మూలవర్లకు అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారి క్రిష్ణమూర్తి, నాగరాజ, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బి.కొత్తకోట : అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబీ అధికారులు పట్టుకుని ఆదివారం పోలీసులకు అప్పగించారు. మండలంలోని బడికాయలపల్లెకు చెందిన నవీన్(23) ట్రాక్టర్‌లో ఇసుకను బి.కొత్తకోటకు తరలిస్తున్నాడు. దీనిపై దాడులు నిర్వహించి అనుమతి లేదని నిర్ధారించారు. నవీన్‌పై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇసుక ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకున్నారు.

పెంతుకోస్తు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు



హోసన్న గాస్పల్ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో నిసార్‌అహ్మద్

మదనపల్లె : పట్టణంలోని శేషప్పతోట పెంతుకోస్తు చర్చిలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్‌అహ్మద్ ఆదివారం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ జింకా చలపతితో కలిసి చర్చికి వెళ్లిన ఆయన.. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఫాదర్ నుంచి ఆశీస్సులను అందుకున్నారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ మాట్లాడుతూ... జీసస్ దయ అందరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థనలు చేసినట్లు చెప్పారు. సర్వ మతాలను గౌరవించడం అలవాటు చేసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్రంలో ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమం, అభివృద్ధి మరోసారి కొనసాగేలా ఆశీర్వదించాలని దేవుడిని ప్రార్థించామన్నారు. అలాగే కురవంకలోని హోసన్న గాస్పల్ చర్చ్‌లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో నిసార్‌అహ్మద్ పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రిస్టియన్ మైనారిటీ జనరల్ సెక్రటరీ రాజేష్, కొండామారిపల్లె ఎంపీటీసీ నీరుగట్టిమేరీ, రమణ, రిచి, రహంతుల్లా, బావాజాన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నను మనసారా ఆశీర్వదించండి



ఎన్నికల ప్రచారంలో పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శ్రీనాథరెడ్డి

పీలేరు రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి నిండు మనస్సుతో ఆశీర్వదించి రాష్ట్రానికి రెండోసారి ముఖ్యమంత్రిని చేయాలని పీలేరు, కేవీపల్లె మండలాల పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి అన్నారు. ఆదివారం తలపుల పంచాయతీలో తలపుల, భయ్యారెడ్డిగారిపల్లె, జంగంపల్లె, సాములవారిపల్లెలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గడిచిన ఐదు సంవత్సరాల్లో వైఎస్సార్‌సీపీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు గూర్చి వివరించారు. జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా లబ్ధి పొందిందని తెలిపారు. సంక్షేమ పథకాలు యదావిధిగా కొనసాగాలంటే రాజంపేట ఎంపీగా పెద్దిరెడ్డి వెంకట మిథున్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా చింతల రామచంద్రారెడ్డిని మరోసారి గెలిపించి, హ్యాట్రిక్ విజయాన్ని కానుకగా ఇవ్వాలని కోరారు. సర్పంచ్ శిరీషాసందీప్‌రెడ్డి, ఎంపీటీసీ రమ ణ, నాయకులు మల్లికార్జునరెడ్డి, చక్రపాణిరెడ్డి, మస్తాన్, కేశవరెడ్డి, మదన మోహన్‌నాయుడు, భరత్‌రెడ్డి, సుబ్బారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, చక్రధర్, ఆంజినేయులు, శేఖర్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

అలరించిన దుర్యోధన వధ నాటకం



దుర్యోధన యుద్ధం నాటక సన్నివేశ దృశ్యం

కలకడ : మహాభారత యజ్ఞంలో భాగంగా ఆదివారం నిర్వహించిన దుర్యోధన వధ చివరి ఘట్టం ఎంతో అలరించింది. కలకడ శ్రీకామాక్షి సమేత సిద్దేశ్వరస్వామి ఆలయం సమీపంలో బాలయ్యగారిపల్లె పంచాయతీ మాజీ సర్పంచ్ రామయ్య, ధర్మకర్త 18 రోజులు పాటు నిర్వహించిన మహాభారత యజ్ఞం చివరి రోజు దుర్యోధన వధ ఘట్టంలో భీముడు-దుర్యోధనుడు పోటాపోటీగా పాడిన పద్యాలు, మహా భారతయుద్దానికి దారితీసిన ఘటనలు వివరించారు.

ఇఫ్తార్ విందులో ఎంపీ, ఎమ్మెల్యే



మసీదులో ప్రార్థనలు చేస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల తదితరులు

కలకడ : ముస్లిం సోదరులు ఆదివారం అందించిన ఇఫ్తార్ విందులో ఎంపీ పివి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. మండల పర్యటనలో ఉన్న ఎంపీ, ఎమ్మెల్యేలు మధ్యాహ్నం బిలాల్-ఇ మసీదులో ప్రార్థనలు చేశారు. సాయంత్రం ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ప్రత్యేక ప్రార్థనల్లో రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఇక్బాల్‌అహమ్మద్, ఎంపీటీసీ సభ్యులు ముబారక్, షావత్‌అల్లీఖాన్, కెఎస్ మస్తాన్, కరీముల్లా, సుల్తానీబాష, జిలానీ పాల్గొన్నారు.

పీలేరులో..

పీలేరురూరల్ : పీలేరు కార్పెంటర్స్ కాలనీలో ముస్లిం సోదరులకు పెద్ద ఎత్తున ఇఫ్తార్‌విందు ఇచ్చారు. ఆదివారం సాయంత్రం ముస్లింల ప్రార్థన అనంతరం ఇఫ్తార్ విందు ఇచ్చారు. ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కార్పెంటర్స్ యూనియన్ అధ్యక్షులు రెడ్డిబాబు, కార్యదర్శి అంబికాపతి ఆచారి, కోశాధికారి శంకరాచారి, గౌరవాధ్యక్షులు మాబాషా, సలహాదారులు వేణు ఆచారి, ఉపాధ్యక్షుడు కమల్‌బాషా, ఉప కార్యదర్శి మోదీన్‌బాషా, నాయకలు తదితరులు పాల్గొన్నారు.

రెడ్డెమ్మ తల్లీ.. కరుణించమ్మా..



సంతానం కోసం అమ్మవారి ఎదుట వరపడిన మహిళలు

గుర్రంకొండ: మండలంలోని చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిటకిటలాడింది. ఈసందర్భంగా ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయానికి వేకువజాము నుంచే భక్తులు చేరుకొన్నారు. మహిళలు అమ్మవారి కోనేట్లో స్నానమాచరించి సంతాన కోసం అమ్మవారి ఎదుట వరపడ్డారు. మొక్కులు తీరిన భక్తులు అమ్మవారికి బంగారు, వెండి, చీరెసారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు. పలువురు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో తలనీలాలు సమర్పించారు. పలువురు భక్తులు ఆలయంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. హిందువులతో పాటు ముస్లింలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారికి దర్శించుకున్నారు.

ఎంపీ, ఎమ్మెల్యేను భారీ మెజార్టీతో గెలిపించాలి



తరిగొండలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న చింతల సాయికృష్ణారెడ్డి

గుర్రంకొండ: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రా రెడ్డిలను మరోసారి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని చింతల సాయి కృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని తరిగొండ గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపే నాయకులను ఎన్నుకోవాలన్నారు. తద్వారా ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. టీడీడీ నేతల కల్లబొల్లి మాటలు నమ్మితే ప్రజలు మోసపోయినట్లేనన్నారు. రాష్ట్రంలో ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేసి పేదల గుండెల్లో చిరస్థాయిగా జగనన్న నిలిచిపోయారన్నారు. పార్టీలకు, కులాలు, మతాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమపథకాలు అందించిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక ఆహ్వానితులు ఎల్వీరమణ, రెడ్డినరసింహారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, నాయకులు మోహన్, ధర్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాహితీ వసంతానికి కవికుల స్వాగతం

- 25 ఏళ్లుగా సాగుతున్న మరసం కళాసాహితీ సేవలు
- 9న ఉగాది వేడుకలు, కవి సమ్మేళనం



రజతోత్సవాల కరపత్రాలు ఆవిష్కరిస్తున్న రచయితలు

మదనపల్లె సిటీ: మావి చివుర్లు తిని వచ్చే మత్త కోయిలలు... వేదికలపై కళాత్మక వీరవిహారం చేసే కవి మత్తేభాలు.. నేనూ ఓ కవిత విసురుతానని సరదా తీర్చుకునే తూనీగలు.. ఆసువుగా ఇలా వచ్చి అలా వెళ్లిపోయే సీతాకోక చిలుకలు.. ఒకటేమిటి. షడ్రుచి భరితమైన కవి సమ్మేళనాల మేళవింపుల వేదిక మదనపల్లె రచయితల సంఘం (మరసం). మరో యుగానికి ఆహ్వానం పలుకుతూ 25 ఏళ్ల పూర్తి చేసుకుని 26వ ఏటాలోకి అడుగిడుతుంది. 9న ఉగాది పండుగ రోజు 26వ వార్షికోత్సవం నిర్వహించనున్నారు. ఇంతింతై వటుడింతయై అన్నట్లు తొలినాళ్లలో జిల్లా స్థాయి కవులతో ప్రారంభమై నేడు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందింది. 1997లో బీటీ కాలేజీ రిటైర్డు తెలుగు అధ్యాపకులు మల్లెల గురవయ్య, విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు కరణం బాలసుబ్రమణ్యం పిళ్లై, సీనియర్ జర్నలిస్టు పురాణం త్యాగమూర్తిశర్మ, తొలి మహిళా న్యూస్ రీడర్ జోశిపాలెం మంగమ్మ , కేంద్రసాహితీ అవార్డు గ్రహీత వల్లంపాటి వెంకటసుబ్బయ్య తదితరులు తన మిత్ర బృందంతో కలిసి స్థానిక బెంగళూరు రోడ్డులోని జిజ్ఞాస భవనంలో సంస్థను నెలకొల్పారు. ఈ పాతికేళ్లలో ప్రతి ఏడాది ఉగాది రోజున కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. దీంతో పాటు ఎంతో మంది కవులను ప్రోత్సహిస్తున్నారు. నూతన గ్రంథాలను సమీక్షలు నిర్వహించడంతో పాటు వారికి ప్రోత్సాహక బహుమతులు అందిస్తున్నారు. తెలుగు భాషా కోసం పాఠశాలల్లో కథల పోటీలు నిర్వహించడం, ప్రతి ఏడాది కృష్ణాష్టమి వేడుకలు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం మరసం గౌరవ అధ్యక్షులుగా పురాణం త్యాగమూర్తిశర్మ, ప్రధాన కార్యదర్శిగా యుగంధరాచారి, సహాయ కార్యదర్శిగా రామమోహన్‌నాయుడు వ్యవహరిస్తున్నారు.

కార్యశాలలు, సదస్సులు, పోటీలు:

తెలుగుభాషాభివృద్ధి కోసం మరసం కార్యశాలలు, సదస్సులను ప్రత్యేకంగా నిర్వహిస్తుంటుంది. ప్రతి వారం మరసం కార్యాలయంలో సాహితీ సమావేశాలు క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచే భాష, బోధన విషయంలో సరిదిద్దుకుంటూ రావాలన్న లక్ష్యంతో జిల్లా వ్యాప్తంగా యువ రచయితలకు పద్య రచన, పాఠ్యాంశ బోధనల్లో కార్యశాలలను నిర్వహించింది. పద్య రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారు.

పండుగంటే పండగే..

మరసం ఉగాది పండుగ రోజు సాయంత్రం అయిదు గంటల నుంచి కార్యక్రమాలు మొదలు పెడతారు. కవి సమ్మేళనం, నాటకాలు, కవితలు మొదలుగువని నిర్వహిస్తున్నారు. కవులకు సన్మానంతో పాటు ప్రశంసపత్రాలు, మెమోంటోలను అందజేస్తున్నారు.

సంస్కృతిని కాపాడటం కోసమే..



పాతికేళ్లగా కవి సమ్మేళనాలు నిర్వహిస్తున్నాం. ఇదంతా కేవలం తెలుగు భాషా సంస్కృతులను నిలపడం కోసమే. ఉగాది ఉత్సవానికి ఆడ,మగ అందరూ సంప్రదాయ దుస్తుల్లో రావాలి. ఉగాది పండుగ రోజు మా కార్యక్రమానికి వచ్చేవారు కవితా ప్రదర్శనలను ఆస్వాదిస్తారు. కవి సమ్మేళనం, నాటకాలు నిర్వహించి వారికి ప్రోత్సాహకాలు అందజేస్తున్నాం.

–లింగాల యుగంధరాచారి, మరసం ప్రధాన కార్యదర్శి